# వందరూపాయల నోటు

పడకకుర్చీలో పడుకొని పేపరు చదువుకుంటున్నాడు దాసు. ఇంతలో ఎవరో తలుపు తట్టారు. "దాసుగా రున్నారా ?"

పేపరు చేతికి తీసుకోగానే ప్రక్కన పెట్టవలసినందుకు విసుక్కుంటూ లేచి తలుపుతీశాడు దాసు. అదే క్షణాన అతనికి విద్యుద్ఘాతం తగిలినట్టయి ఒక అడుగు వెనక్కివేశాడు. గుమ్మంలో పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్ ప్రత్యక్షం. దాసు ముఖం పాలిపోయింది. తను అనుకున్నంతపనీ జరిగింది. కిందటి రోజు జరిగిన విషయం వెంటనే అతని మనోవీధిలో గిర్రున తిరిగింది.

వందరూపాయల నోటు చిల్లరకోసం బజారంతా తిరిగి తిరిగి వేసారాడు దాసు. ఎక్కడా దొరికేసూచన కనిపించలేదు. బ్యాంకులు తెరిచే సమయం కాదు. పొద్దున్నే చిల్లరకోసం బయల్దేరవలసి వచ్చింది. చివరికి కొంత ముఖపరిచయం ఉన్న ఓ చిన్న బట్టల వర్తకుడిని ఆఖరి ప్రయత్నంగా అడిగాడు. అదృష్టవశాత్తూ అతనిదగ్గర సరిగా వందరూపాయల చిల్లర నోట్లున్నాయి. అయితే, అతను వెంటనే చిల్లర ఇవ్వకుండా దాసు దగ్గిర నోటు తీసుకొని పరిశీలించసాగాడు. ఆ పరిశీలనచూసి దాసుకి చిరాకు వేసింది.

"ఏమి టంత సేపు చూస్తున్నారు ?"

"ఇది మంచి నోటేకద ?"

శ్రీకాకుళం

"మంచిది కాకపోతే ఎందుకిస్తానండీ ?" అసలు మంచిది కాకపోతే నేను మాత్రం ఎందుకు తీసుకుంటాను ?''

"ఆ నమ్మకం మీకుందిగద. రోజులు మంచివిగావులెండి. ఏ నోటెటు వంటివో ? ఇక్కడేదో సంతకంఉంది చూడండి. అదెవరిదై ఉంటుందో చూస్తున్నాను."

"సంతకాని కేమిటండీ ? నోటు నలిగినట్టుంటే ఎవరో పుచ్చుకొనేవాళ్లు సంతకం కావాలని అడిగి ఉంటారు. కావాలంటే నేనుకూడా ఓ సంతకం పెట్టేస్తాను. అనుమానం ఉంటే చెప్పండి."

"ఎంతమాట ! సరే, మాటన్నారు కనుక ఓ చిన్న సంతకం పెట్టేస్తారా ? మీమీద నమ్మకం లేకకాదు. నమ్మకం లేకపోతే అసలు తీసుకునేవాణ్ని కాదుగా. హి....హి.... ఏమంటారు ?''

తన ఇరకాటాన్ని కప్పిపుచ్చుకుంటూ లేనినవ్వు తెచ్చుకుని అవస్థపడు తున్న దుకాణదారుని చూసి నవ్వుకొన్నాడు దాసు. మరేమీ ఆలోచించ కుండా జేబులోంచి కలంతీసి నోటుమీద సంతకం పెట్టబోయాడు. కాని ఆ క్షణాన ఎందుకో చెయ్యి వణికింది. నిజానికి అది మంచినోటో, దొంగనోటో అతనికి తెలియదు. మంచినోటుకీ దొంగనోటుకీ ఉన్న తేడా అతనికి కించిత్తు తెలియదు. అయినా అది మంచినోటే ఐ ఉంటుంది లెమ్మని మనసు సరిపుచ్చుకున్నాడు. తీరా సంతకం పెట్టబోయేసరికి అత నికి అనుమానం బలమైంది. ఎటుపోయి ఎటు వస్తుందో, కొంపతీసి రోజులు మంచివి కాకపోతే తన కంఠానికి చుట్టుకోదుగద ! ఆలోచించి, ఎందుకైనా మంచిదని తన మామూలు సంతకానికి భిన్నంగా ఉండేలా సంతకం పెట్టేశాడు. అతని గుండె ఆ క్షణాన గబగబ కొట్టుకుంది. దుకాణదారుడు అది కనిపెడతాడేమో నని భయపడి తన అనుమానం బయటికి తెలియనియ్యకుండా చిరునవ్వునవ్వుతూ అతనికి నోటందిస్తూ అన్నాడు.

''ఇదిగోనండి, గుప్తగారూ. మీ అనుమానం తీరిపోయినట్టేనా ?''

గుప్త చిన్నగానవ్వి. "ఎంత మాట!" అని నోటు తీసుకుని చిల్లర ఇచ్చి పంపాడు.

ఈ వృత్తాంతమంతా పోలీసు ఆఫీసర్ని చూడగానే దాసు మనసులో మెదిలింది. సంతకం పెట్టిన క్షణంనించీ అతనికి ఏదో భయం ఆవహించింది. తను అనాలోచితంగా ఆ పని చేశాడనుకున్నాడు. పోలీసు అధికారుల ముందు తను సమాధానం చెప్పవలసి వస్తే చాలా చిక్కులో పడతాడు. ఆనోటు తనకి ఎక్కడనించి వచ్చిందో వాళ్ళకి నచ్చచెప్పాలి. ఎలా చెప్పగలడు. అది తనకి దొరికింది. ఎక్కడోకాదు ? దొడ్డిగుమ్మం ఉన్న సందులోనే. అక్కడ ఆనోటు ఎవరు పారేసుకున్నారో తనకి ఆశ్చర్యంగానే ఉంది. బహుశా పక్కన ఉన్న బంగళాలోని ఆఫీసర్‌గారు నిషాలో దొడ్డిగుమ్మంనించి ఇంట్లోకి వెళ్ళబోతూ జేబు సవరించుకుంటే జారిపోయి ఉంటుందని సమాధానం చెప్పుకున్నాడు. అదే సరైనదని అతను గాఢంగా నమ్మాడు, ఆయనని పిలిచి ఇచ్చివేద్దామని మొదట అనిపించినా చివరికి మనసొప్పలేదు. ఆయన కావలసినంత ఉన్నవాడు. వంద రూపాయలు లెక్కేమిటి ? తనకి ఆడబ్బు చాలా సమస్యల్ని తీరుస్తుంది నీతి నియమాల్ని గురించి ఈ విషయంలో అంత ఆలోచించవలసిన అవసరంలేదు. అదే ఒక బీదవాడిదై ఉంటే తను కక్కుర్తి పడేవాడు కాదు. ఇంతకీ అది తనకి దొరికినది, పోగొట్టుకున్నవాడు అడిగినప్పుడు కదా సమస్య ప్రారంభమయేది. సిరిరామోకాలొడ్డట మెందుకు? ఆ డబ్బు వాడు కోటానికే దాసు నిశ్చయించు కున్నాడు.

దాసు ఆ నిర్ణయం తీసుకున్నందుకు విచారించ వలసిన సమయం ఆసన్నమైందని పోలీసు ఆఫీసర్ని చూడగానే తీర్మానించుకున్నాడు. సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిఉండాలి. లేకపోతే అది

దొంగనోటై బయట పడి ఉండాలి, ఈ రెంటిలో ఏది జరిగినా తనకిముప్పే. ఇలా దాసు మనసులో ఆలోచనలు రేగుతూనే ఉన్నా యాంత్రికంగా అతను పోలీస్ సబిన్స్పెక్టర్ని మర్యాదచేసి లోపలికి ఆహ్వానించి కూర్చో బెట్టి ఆదుర్దాగా అతనివైపు చూడసాగాడు. సబ్ ఇన్స్పెక్టర్ కొంచెంసేపు దాసుని నఖశిఖ పర్యంతంచూసి ఇల్లంతా చుట్టూ కలయచూసి తాపీగా అన్నాడు.

''దాసుగారు మీరేనా?''

''అవునండి. పనిమీద వచ్చారు. ఏమిసంగతి?'' భయపడుతూనే అడిగాడు దాసు.

''మీరు నాతో ఓసారి పోలీస్ స్టేషన్కి రావాలండి.''

దాసుకి మిగిలిన కాస్తధైర్యం హరించి పోయింది. హీనస్వరంతో అన్నాడు లేని నవ్వు తెచ్చుకుంటూ.

''ఏదైనా దొంగతనం కేసులో సాక్ష్యం ఇవ్వాలా ? ఈ మధ్య మా చుట్టు పక్కల దొంగతనం జరిగిన భోగట్టా ఏమీ లేదే?''

''అబ్బే, దొంగతనం కాదండి.''

దాసు మనసు కొంచెం కుదట బడింది. ఒక విషయం తేలిపోయింది.

''మరి కారణ మేమిటి?''

''సూపరింటెండెంట్ దొరగారు చెబుతారు, పదండి, పోదాం,'' అని సబిన్స్పెక్టర్ లేచాడు' అతనిని దాసు అనుసరించాడు. పోలీస్ వాన్లో కూర్చున్నంతసేపూ తనని ఎలా సమర్థించుకోవాలో ఆలోచిస్తూనే ఉన్నాడు దాసు. వాన్దిగి పోలీస్ స్టేషన్లో అడుగు పెట్టగానే ఏవో కాగితాలు చూసుకొంటున్న దొరగారికి పరిచయం చేశాడు దాసుని సబ్ ఇన్స్పెక్టర్. దొరగారికి సమస్కారం చేసి ఆయన ఆ నమస్కారాన్ని స్వీకరించి కూర్చోగానే కూర్చుని చుట్టూచూచి అదరి పడ్డాడు దాసు. పక్క కుర్చిలో గుప్త

కూర్చుని ఉన్నాడు. ఆయన దాసు వైపు కొంచెం కోపంగా చూడసాగాడు. గుప్త పక్కన మరో ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు. వాళ్లెవరో దాసుకి తెలియదు.

దొరగారు కాగితాలు చూడటం ముగించి తల పైకెత్తి అందరివైపూ ఓసారి చూసి ఇలా అన్నారు. "మిమ్మల్నందర్నీ ఇక్కడికి రప్పించి శ్రమ కలిగించి నందుకు చింతిస్తున్నాను. మనం మాట్లాడవలసిన విషయం ఒక వందరూపాయల నోటుని గురించి."

గుప్త దాసువైపు ఉరిమి చూశాడు. దాసు తల దించుకున్నాడు. దొరగారు డ్రాయర్‌లోంచి ఓ వంద రూపాయలనోటు తీసి చేతిలో పట్టుకున్నాడు. ఆ నోటుని చూడగానే దాసుకి పై ప్రాణం పైనే పోయింది. "ఈ నోటు మూర్తిగారు బ్యాంకులో మారుస్తూ ఉండగా ఆ సమాచారం మాకు బ్యాంకు వారి ద్వారా అందింది. మూర్తిగారిని ప్రశ్నించగా ఇది తమకి ఈ ఉదయమే రావుగారు ఇచ్చిన నోటని చెప్పారు, అవునా మూర్తిగారూ?"

కుర్చీల వరసలో ఒక చివర కూర్చున్న వ్యక్తిని ఉద్దేశించి దొరగారు అడిగారు, ఆయన నమ్రతగా తల ఊపి "అవునుసార్" అన్నాడు.

దొరగారు తిరిగి "అవునా రావు గారూ?" అని అడిగారు, మూర్తి పక్కన కూర్చున్న వ్యక్తిని ఉద్దేశించి.

"అబద్ధంసార్" అన్నాడు రావు గంభీరంగా.

దొరగారు కొంచెం తెల్లబోయి రావువైపు దీక్షగా చూసి అన్నారు.

"అంటె మీరీనోటు మూర్తిగారి కివ్వలేదంటారా?"

"ఇవ్వలేదండి."

మూర్తి ముఖంలో ఆశ్చర్యం తాండవించడం దాసు గమనించాడు.

"ఇవ్వలేదా!" అని మూర్తి రావువైపు చూసి రెట్టిస్తూ అడిగాడు. కోపాన్ని అణుచుకుంటున్నట్టు ఆయన ముఖ కవళికలు చెబుతున్నాయి.

"మీరు ఊరుకోండి. అడిగిన వారే సమాధానం చెప్పాలి, దయచేసి' అన్నారు దొరగారు. ఒక క్షణం ఆగి ఆయన అన్నారు రావువైపు చూస్తూ

"మరెవరికైనా ఇచ్చారా?"

"లేదండి"

ఒక క్షణంఆగి దొరగారు అన్నారు.

"మూర్తిగారికి మీరసలు డబ్బేమీ ఈ ఉదయం ఇవ్వలేదా?"

"ఇచ్చాను. కాని ఆనోటు ఇవ్వలేదు."

"మీ రీ నోటు సరిగా చూడనైనా చూడలేదు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు."

"నేనాయనకిచ్చినవి పది రూపాయల నోట్లు కనుక."

దొరగారు కొంచెం తృప్తిపడ్డట్టు కనిపించారు. కాని మూర్తి గట్టిగా "అబద్ధం" అని లేచి నుంచునే సరికి ఆయన కనుబొమ్మలు చిట్లించి మూర్తి వైపు చూశాడు. ఆయన ముఖంలో ఏదో సమస్య గోచరించింది.

"మీ రెవరికైనా వంద రూపాయల నోట్లు ఎప్పుడైనా ఇచ్చినట్టు జ్ఞాపకం ఉందా?"

రావు వెంటనే సమాధానం చెప్పాడు.

"బాగా అడిగారు, ఎన్నిసార్లో ఇచ్చి పుచ్చుకున్నాను. నేనంత లేనివాడిని కాదండీ."

"ఎన్నిటిమీద సంతకాలు పెట్టారో జ్ఞాపకంఉందా?"

"నేనసలు సంతకం పెట్టందే?"

దొరగారు వెంటనే నోటు ఆయనకి చూపించి అడిగారు,

"ఈ సంతకం మీదేనేమో చూడండి."

Vishwa Shanthi ...
... Mirzaguda. ...



రావు ఆ నోటువైపు చూడబోయి వెంటనే మనసు మార్చుకుని దొరగారి వైపుచూసి అన్నాడు.

"నాదికాదు."

"చూడకుండానే చెబుతున్నారే."

"చూడవలసిన అవసరం ఏముంది. నేనసలు నోటుమీద ఎప్పుడైనా సంతకం పెడితేకదః"

దొరగారు చిరునవ్వు నవ్వారు.

శుద్ధ అబద్ధంసార్. ఈ నోటు మీద సంతకం పెట్టమని అడగగానే ఆయన పెట్టాడు. కావాలంటె మాదిరి సంతకం పోల్చిచూడండి."

దొరగారు రావు సంతకం ఓ కాగితంమీద తీసుకుని నోటుమీద సంతకంతో పోల్చిచూసి పెదవి విరిచాడు. మూర్తి ముఖంలో నిరాశ తాండవించింది.

"అసలు మీరు మూర్తిగారికి డబ్బెందుకిచ్చారుః"

మూర్తిగారితో నాకు కొంచెం ముఖ పరిచయం ఉందండి. డబ్బు అప్పు కావాలని అడిగితే ఇచ్చాను. అంతకంటే నాకేమీ తెలియదు."

"మీరేమంటారు మూర్తిగారూః"

"నేను డబ్బు అప్పుకోసం రావుగారి దగ్గిరికి వెళ్ళానండి. ఆయన ఈ వంద రూపాయిలనోటు ఇచ్చారు. తీసుకుని వెళ్లి మళ్ళీ ఎందుకైనా మంచిదని ఆనోటు నలిగినట్టుంటె రావుగారి సంతకంకోసం ఆయనింటికి తిరిగి వెళ్ళాను. రావుగారు లోపల ఉన్నారని గుమాస్తా చెబితే ఆయన ద్వారా రావుగారి సంతకం చేయించి తీసుకుని బ్యాంకుకి పోయాను. తరువాత జరిగింది మీకు తెలిసిందే. అంతే ఆ నోటుని గురించి నాకు తెలిసిన విషయం. తరవాత మీ ఇష్టం" అని మూర్తి ముగించాడు. అతని ముఖంలో నిజా

యితి గోచరిస్తోందని దాసు గమనించాడు. రావు పెదవులమధ్య చిన్న వంకరనవ్వు కూడా దాసు గమనించక పోలేదు.

"సరే. గుప్తగారూ. మీరేమంటారు? ఈనోటుమీద మీ సంతకం ఎలా వచ్చిందో చెప్పండి." గుప్తవైపుచూసి అడిగారు దొరగారు. జరిగిన విషయమంతా గమనిస్తూ వున్న గుప్త రావువైపు ఓసారి చూశాడు. రావు తనకేమీ సంబంధం లేదన్నట్టుగా మరోవైపు కళ్ళప్పగించి చూడసాగాడు. గుప్తకి చటుక్కున ఓ దివ్యమైన ఆలోచన తట్టింది. ఆ నోటు తను స్వహస్తాలతో రావు కిచ్చాడు. ఆయన గొణిగితే దానిమీద సంతకంకూడా చేశాడు. కాని అప్పుడు వ్యవహారం ఇలా పరిణమిస్తుందని అనుకోలేదు. దాసు మాటవిని అది మంచినోటని అనుకోటంవల్ల చప్పున సంతకం పెట్టేశాడు. ఈ తంతంతా చూస్తే తను చిక్కులో పడేట్టు కనిపించింది. సరే, రావు అందించిన బ్రహ్మాస్త్రం ఉండనేఉంది. తనే మహా తెలివైన వాడనుకున్నాడు పూర్వం. అందువల్లే ఎటుపోయి ఎటు వస్తుందోనని నోటుమీద సంతకం హరిహరాదులైనా తనసంతకమని కనుక్కోలేకుండా పెట్టేశాడు. కాని రావు తనకి తీసిపోలేదు. అతనూ అదేపని చేశాడు. నవ్వుకున్నాడు గుప్త, నోటందుకుని చూశాడు.

"చిత్తం. ఈ సంతకం నాదికాదండి. నోట్లమీద సంతకాలు పెట్టటం నాకల వాటేగానండి, ఇది మాత్రం నా సంతకంగాదు బాబూ. ఇదిగో నా మాదిరి సంతకం చూడండి.

దొరగారు అంత ఉత్సాహంగాలేరు. చూసీ చూడనట్టు ఆ సంతకం చూచి పెదవి విరిచి దాసువైపు అన్నారు.

"ఏమండి దాసుగారు, మీ మాదిరి సంతకము చూపిస్తారా? మీరుకూడు ఈ నోటుమీద సంతకము పెట్టలేదనే అంటారనుకుంటాను."

దాసు కొంచెం స్వేచ్ఛగా గాలి పీల్చి అన్నాడు. "నోట్లమీద అప్పుడప్పుడు

సంతకం పెట్టడం అలవాటేగానండీ, ఆ సంతకం నాదో కాదో చూస్తేగాని చెప్పలేను. ఏదీ ఇలా ఇవ్వండి."

దాసు నోటు తీసుకొని వెకిలి నవ్వు నవ్వి "ఎబ్బే. ఇది నాదికాదుసార్, మీరే చూడండి, ఇదిగో నా మాదిరి సంతకం." అని కాగితంమీద తన మామూలు సంతకం నిర్లక్ష్యంగా దర్జాగా గీకిపారేశాడు.

"తస్సాదియ్యా! అందరూ అందరే. నేనే అనుకున్నాను జాగ్రత్త మనిషి నని." అనుకున్నాడు గుప్త తనలో తను నవ్వుకుంటూ. దాసు కళ్ళచివర లోంచి గుప్తవైపుచూచి కళ్ళతోనే నవ్వాడు.

దొరగారు ముఖం చిట్లించుకొని నిరుత్సాహం ఆవరించినట్టయి అన్నారు. "ప్లానంతా తలకిందులైపోయింది. ఈ దెబ్బతో ఓ పెద్ద లంచగొండి ఉద్యోగిని వలలో పట్టానని సంతోషిస్తే అదంతా వొట్టిదైపోయింది. నోటు మీది మొదటిసంతకం నాదే. ఓ అధికారి లంచగొండితనాన్ని రుజువు చేయాలని ప్లాను వేశాం. కాని తీరా సోదాచేసేసరికి ఆనోటు దొరకరేదు. ఇవాళ మూర్తిగారు బ్యాంకులో మారుస్తుంటే దాని ఆచూకి దొరికింది. కాని ఏం లాభం? ఆ సంతకాలు చేసినవ్యక్తులు సాక్ష్యమిస్తేకాని ప్రయోజనం లేదు. ఒక్కొక్కరికి పెద్ద బహుమానంకూడా ఇవ్వాలని సంకల్పించాను. ఆ సంతకాలు మీవైతే మీలో ప్రతి ఒక్కరికీ తలో వందైనా బహుమానం లభించిఉండేది. మీరూ, నేనూ అందరం దురదృష్టవంతులమే! శ్రమ ఇచ్చినందుకు విచారిస్తున్నాను."

దొరగారు లేచారు. ఎవరి ముఖంలోను నెత్తురుచుక్కలేదు. అయితే, అది దొంగనోటు కాదన్నమాట! గుప్త రావు వైపు ఉరిమిచూశాడు. దాసు గుప్తవైపూ, రావు వైపూ నమిలి మింగేసేట్టుచూశాడు. రావలసిన బహుమానాలు పోయాయి.

"సార్! నా నోటు నా కిప్పిస్తారా!"

"అప్పుడే వీల్లేదండి. ఇదేదో పన్నాగంగా కనిపిస్తోంది. ఈ నోటుమీద సంతకాలు పెట్టినవాళ్ళని పట్టుకుని జైల్లోవేసేదాకా ఇది నాదగ్గిరేఉండాలి."

వెలవెలబోయిన ముఖాలతో దాసు, గుప్త, రావు ఒకరినొకరు కోపంగా చూసుకోవటం దొరగారు గమనిస్తూనే ఉన్నారు. (1959)